# చెల్లని కాసు

లావణ్య.

నిజంగా లావణ్యే!!

అందమైన ఆమె శరీరం, ముద్దులొలికే ఆమె తేనెల మాటలు, రాజహంసలాంటి ఆమె నడక, ఎత్తయిన గుండెలు, మత్తెక్కించే కళ్ళు, నోరూరించే ఆమె ఎర్రని పెదాలమీద తడ.

ఎవరికి వారు ఆమె తనకే దక్కాలని ఆ ఆఫీసులో పనిచేసే ముప్పై ఒక్క మందికీ కోరిక. అందులో యాభయ్ ఏళ్ళ మేనేజింగ్ డైరెక్టరు జంబులింగం దగ్గరనుంచి చెవులో దట్టంగా వెంట్రుకలు మొలిచిన డిశ్పాచ్ క్లర్క్ శంకరయ్య వరకూ ఆమెను రోజుకు కనీసం పది సార్లయినా తలుస్తుంటారు.

ఆమె పుణ్యమా అని ఆఫీసు స్టాఫ్ నీట్‌గా మేకప్ అయి ఠంచనుగా ఆఫీసుకు వస్తున్నారు. రెండుసంవత్సరాలకు పూర్వం అంటే లావణ్య అక్కడకు ట్రాన్స్‌ఫర్ కాకముందు నల్లమందు తిన్న బైరాగిలా జోగుతూ వుండే ఆ ఆఫీసు ఇప్పుడు రైల్వే ప్లాటుఫారంలా సందడిగా కళకళలాడుతూ ఉంది.

సమయం ఉదయం పదిన్నరయింది.

స్టెనో లావణ్య సీటు ఖాళీగా ఉంది. టేబులుమీద టైపుమిషను ఏడ్చిఏడ్చి నిద్రబోయిన పసిబిడ్డలా పడి వుంది.

ఆమె ఇంకా ఎందుకు రాలేదో అర్థంకాక బట్టతలను మాటిమాటికీ నిమురుకొంటున్నాడు జంబులింగం.

సిగరెట్లుమీద సిగరెట్లు తగలేస్తున్నాడు సెక్షన్ హెడ్ సదానందం.

ఇకపోతే 'ఓ' సీట్లో కూర్చొని వున్న యువ రచయిత కాశీ ఆమె మీద ఎన్నో గేయాలల్లుతున్నాడు మనసులో.

జయమాలిని అభిమాని కనకయ్య సరేసరి ఎప్పుడెప్పుడు లావణ్య వస్తుందా, ఎప్పుడెప్పుడు తన ఎక్సరే కళ్ళతో ఆమెను నగ్నంగా చూసి ఆనందిద్దామా అని భ్రమ పడుతున్నాడు.

ఇక డిస్పాచ్ క్లర్ శంకరయ్య సంగతి సరేసరి. రిజిష్టరు అడ్డం పెట్టుకుని అటూ-ఇటూ దొంగ చూపులు చూస్తున్నాడు.

ఇలా కాలం స్తంభించిపోయి వుంది.

ఇంతలో సుగంధ ద్రవ్యాలు గాలిలో కలసి ఆ హాల్లో ప్రవేశించి అందరి నాసికా పుటాల్లోకి దూరాయి. అందరూ అలెర్టయి పోయారు. వెనుకనే అప్సరసలా లోనికి ప్రవేశించింది లావణ్య.

అందరూ ఆమె ఆలస్యానికి కారణాలు అడుగుతూ తమ సానుభూతి చూపిస్తున్నారు. ఆమె చిరునవ్వే అందరికీ సమాధానం. దానికే మురిసిపోతున్నారు.

ఆమె నేరుగా సెక్షన్ హెడ్ దగ్గరకు వెళ్ళి నిలబడింది.

సెక్షన్ హెడ్ సదానందం నాజూకుగా కాలరొకసారి సర్దుకుని "హి...హి...హి...కూర్చో లావణ్యా" అన్నాడు.

"నేను కూర్చోడానికి రాలేదు మీకు బుద్ధుందా అని అడగడాని కొచ్చాను" గట్టిగా అంది లావణ్య.

ఈ హఠాత్పరిణామానికి సీట్లలో కూర్చుని వున్న వాళ్ళంతా ఉలిక్కి పడ్డాడు. ఆ వెంటనే పరుగెత్తుకువచ్చి సెక్షన్ హెడ్, లావణ్యల చుట్టూ గుంపులుగా నిల్చున్నారు. డిస్పాచ్ క్లర్క్ శంకరయ్య తప్ప.

"నాకు బుద్దెందుకు లేదు?" అంటూ తల తడుముకొన్నాడు సెక్షన్ హెడ్. లావణ్య వచ్చిన తరవాతనే కదా తన తెల్ల వెంట్రుకలకు అంత ఖరీదు అయిన రంగు వేసుకొనేది. అలాంటిది తనకు బుద్దెందుకు లేదు అనుకొన్నాడు.

"ఎవరిని లావణ్యా? నువ్వనేది?"

"మిమ్మల్నేనండి గౌరవనీయులయిన సెక్షన్ హెడ్‌గారూ. నిన్న టాంక్ బండ్‌మీద మీ స్నేహితులతో ఏం కూసారు?"

"ఏం కూసాను? ఏమీ కూయలేదే."

"మీకు వయసొచ్చిందేగాని బుద్ధిరాలేదు. నా రేటు గంటకు రెండు వందలని మీ స్నేహితులు అనలేదూ?"

"అది...అది...కృష్ణ అని నా స్నేహితుడు..." గొణగ సాగాడు.

"కృష్ణ ఎవరో తెలియదుగాని మీకు శ్రీకృష్ణ జన్మస్థానం మాత్రం తప్పదు. ఇప్పుదే వెళ్ళి మేనేజింగ్ డైరెక్టరుకు రిపోర్టు చేస్తాను"

సెక్షన్ హెడ్ భయపడిపోయాడు.

"సారీ లావణ్యా ఈసారికి నన్ను క్షమించు ప్లీజ్" సెక్షన్ హెడ్ హోదా మరచి ప్రాధేయపడసాగాడు.

"ఆల్‌రైట్ నీ వయసుని గౌరవించి ఈసారికి వదిలేస్తున్నాను. ఇక ఎప్పుడయినా ఇలాంటి అసభ్య ప్రేలాపన చేస్తే జరగబోయేది అదే" వెనక్కి తిరిగి హూంకరించింది లావణ్య.

"చిత్తం" అన్నట్టు చెంపలు వాయించుకొన్నాడు సెక్షన్ హెడ్.

తరువాత నేరుగా మూల కూర్చొని ఉన్న డిస్పాచ్‌క్లర్ శంకరయ్య దగ్గరకు వెళ్ళి నిలబడింది. అందరూ గుంపుగా ఆమె వెనుకనే అక్కడికి వచ్చారు. ఏదో విశేషముందని.

లావణ్య ఉగ్ర స్వరూపం చూసి భయపడుతూ లేచి నిల్చున్నాడు శంకరయ్య.

"నిన్న పబ్లిక్ గార్డెన్‌లో పదిమందిని ఎదురుగా కూర్చోబెట్టుకుని నన్ను సినీ స్టార్స్‌తో పోల్చి అంగాంగం వర్ణించావటగా..."

"అవును లావణ్యా. నువ్వొక 'ఏ' క్లాసు స్టార్‌వి. నీలమ్ కళ్ళు, పూనమ్ ఒళ్ళు, సోనమ్ సోయగం నీలో ఉన్నాయి. నేను నిన్ను గాఢంగా ప్రేమి..."

శంకరయ్య మాటలను మధ్యలోనే అందుకుని "భేష్ శంకరయ్యా. నువ్వింత రసికుడవని తెలియదు. ఈ ప్రపంచంలోని మగవాళ్ళంతా గుడ్డివాళ్ళు శంకరయ్యా. హృదయ సౌందర్యాన్ని ఆరాధించడం చేతకాని చవటలు. కానీ నీలా నా అందానికి ఇంత విలువుందని ఎవరూ చెప్పలేదు."

ఆఫీసు స్టాపంతా శంకరయ్య వైపు ఈర్ష్యగా చూసారు.

శంకరయ్యకు మాత్రం ఈ పొగడ్తల వెనుక ఏదో బాంబు పేలుతుందని మాత్రం తెలుసు.

"ఒరే శంకరయ్యా నీది గాడిద ముఖం, పంది మూతి, పిల్లి కళ్ళు, గుర్రం చెవులు, కాకి నలుపు, ఏనుగు శరీరం ఒరేయ్ నువ్వు ఎదురు కట్నం రెండు లక్షలు ఇచ్చినా నేనే కాదు ఏ ఆడదీ నిన్ను పెళ్ళి చేసుకుని నీతో పక్క పంచుకోదురా ఫూల్. నీ అందం ఎలాంటిదో నీకు తెలియడానికే ఇంతమంది ముందు అసలు విషయం చెబుతున్నానురా యూజ్‌లెస్‌ఫెలో"

నోటికొచ్చినట్టు తిట్టి చకచకా వెళ్ళి తన సీట్లో కూర్చొంది.

ఓ అరగంట సేపు ఆఫీసంతా శ్మశాన వైరాగ్యం ఆవరించింది.

లావణ్య వైపు మిషను శబ్దం తప్ప ఎవరూ కిక్కురుమనడం లేదు.

శంకరయ్య లావణ్య వర్ణించిన తన శరీర భాగాల్ని ఒకొక్కటీ తడిమి చూసుకొన్నాడు.

ఇది ఒక్క శంకరయ్యకే కాదు. రోజూ ఎవరో ఒకరికి మూడు తూనే వుంటుంది లావణ్య చేతిలో.

గత రెండు సంవత్సరాల కాలంలో లావణ్య చేతిలో చెప్పు దెబ్బలు తిన్నవారు నారాయణ, చంద్రశేఖర్. చెంప దెబ్బలు తిన్నవారు గురు ప్రసాద్, రాజారావు.

మరుసటిరోజు మేనేజింగ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో డైరెక్టర్స్ కాన్ఫ రెన్స్ వుంది. దాంతో ఆ రోజు స్టెనో లావణ్యకు వర్కు హెవీగా వుంది. ఎంత చేసినా వర్కు తెమలడం లేదు. ఆఫీసు స్టాఫ్ చాలా మంది వెళ్ళిపోయారు.

టైము చూసుకొంది లావణ్య ఎనిమిదిన్నర.

ఎప్పుడూ తను అయిదయ్యేసరికల్లా ఠంచనుగా వెళ్ళిపోతుంది. అలాంటిది ప్రతి నెలాఖరులో జరిగే కాన్ఫరెన్స్‌కు ముందు రోజు మాత్రం అలా వీలుండదు. టైపు చేయాల్సిన నోట్సు చాలా వుంటుంది, అందుకని అప్పుడు కనీసం రాత్రి ఎనిమిది వరకయినా వుండవలసి వస్తుంది.

టైపు చేసిన కాగితాలు ప్యాడ్‌లో కట్టి లోపలికి తీసుకుపోతూ చుట్టూ చూసింది. హాల్లో ఒక్కరూ లేరు. శంకరయ్య మాత్రం తన సీట్లో కూర్చొని ఏదో వ్రాసుకొంటున్నాడు. తను టైపు చేసిన కాగితాలు మేనేజింగ్ డైరెక్టరు సంతకం పెట్టిన తరువాత శంకరయ్యకు వస్తాయి.

తరువాత శంకరయ్య నాలుగు కాపీలున్న పర్టికులర్స్‌ని నాలుగు పుస్తకాలుగా అట్టలువేసి కుట్టి రేపు కాన్ఫరెన్స్‌కు అందిస్తాడు.

తలుపు తీసుకొని మేనేజింగ్ డైరెక్టర్ గదిలోకి వెళ్ళి టైపు చేసిన కాగితాలను అతని ముందుంచింది!

"కూర్చో లావణ్యా" అన్నాడు మేనేజింగ్ డైరెక్టర్ జంబులింగం."

"ఇప్పటికే చాలా లేటయింది సార్. నేవెళ్ళాలి"

"నువ్వు వెళతావు బాగానే వుంది. ఉదయం బ్రెడ్ స్టేట్‌మెంట్‌తో పాటు పంపిన చెక్కు బుక్కెక్కడ"

"టైపు కాగానే ఆ స్టేట్‌మెంట్‌తో బాటు తెచ్చిచ్చాను గదసార్"

"ఎప్పుడు."

"మధ్యాహ్నం"

"నో...నో...నో...చెక్కు బుక్కు రాలేదు. నీ సీట్లో వెళ్ళి చూడు" సీరియస్‌గా అన్నాడు జంబులింగం.

"లేదు సార్. నేనిప్పుడే సీటు సర్ది వస్తున్నాను"

"నీ దగ్గరా, నా దగ్గరా లేకుండా ఎట్లా పోయినట్లు. ఇదిగో చూడు ఇందులో చెక్కు పుస్తకం దగ్గర 'నాట్ రిసీవ్డ్' అని వ్రాసి వుంది" రిజిష్టర్‌లో ఒక పేజీ చూపించాడు.

ఇంపార్టెంట్ కాగితాలు తీసుకొని వెళ్ళేటపుడు తను ఆ పుస్తకంలో సంతకం చేసి తీసుకొని వెళుతుంది. అలాగే ఈ రోజు ఉదయం తను చెక్కు బుక్కు తీసుకొని వెళ్ళింది. కాని తెచ్చిచ్చినట్లు తనకు కూడా గుర్తురావడం లేదు లావణ్య మెదడంతా మొద్దుబారిపోయింది.

"సార్ ఇక్కడేమయినా పొరపాటున కాగితాల్లో కలసిపోయిందేమో" అంది

లావణ్య అనుమానం గమనించి తన సీట్లోంచి లేచి టేబులు సొరుగు తాళాలు బీరువా తాళాలు ఇచ్చాడు. ఆమె ఓ అరగంట సేపు క్షుణ్ణంగా వెతికింది. ఎక్కడా కనిపించలేదు దిగులుగా నిలబడింది.

జంబులింగం తిరిగి తన సీట్లో కూర్చొన్నాడు.

"సార్ ఇప్పుడేమవుతుంది" భయం భయంగా అడిగింది.

"ఏమౌతుంది. ఎవడికి దొరికిందో వాడు మన అకౌంటులో ఉన్న ఇరవై లక్షలూ ఎప్పుడో డ్రా చేసుకొని ఉంటాడు" నెమ్మదిగా అన్నాడు.

"సార్ ఇప్పుడెలా" అంది లావణ్య వణికిపోతూ.

"అవును అది నీ మీదికే వస్తుంది నిన్ను ఉద్యోగంలోంచి తీసేసి నీ దగ్గర నుంచి ఆ మొత్తం రికవరీ చేయాల్సి ఉంటుంది. బై సెల్లింగ్ యువర్ ప్రొపర్టీస్" అన్నాడు నింపాదిగా.

తూలిపోతూ టేబులు అనుకొని నిలబడింది. ఆమెకు జీవితం

అగమ్యగోచరమయింది. ఆమెకు తనమీద ఆధారపడి ఉన్న తమ్ముళ్ళు చెల్లెళ్ళు గుర్తుకొచ్చి పెద్దగా ఏడ్చింది.

"సార్ మీకు జీవితాంతం కృతజ్ఞతగా ఉంటాను. నన్ను ఈ ప్రమాదం లోంచి తప్పించలేరా" అంది కళ్ళు తుడుచుకొంటూ.

కాని జంబులింగం పలుకలేదు

అతనికి ఒకనాడు తాను పొందిన అవమానం గుర్తుకొచ్చింది. ఒకనాడు ఆమె తన గదిలో డిక్టేషన్ తీసుకుంటూ ఉంది. మేటర్ డిక్టేట్ చేస్తూ అటుచూసిన జంబులింగంకు పైట స్థానభ్రంశం చెంది తొంగి చూస్తున్న ఆమె అందమైన వక్షద్వయం కనిపించింది. కంట్రోలు చేసుకో లేక ఇటు తిరిగి వచ్చి ఆమె భుజాలు స్పృశిస్తూ ముందుకు వంగాడు. అంతే ఈడ్చి కొట్టింది లావణ్య తనను మేనేజింగ్ డైరెక్టర్ అని కూడా చూడకుండా.

తనను తదేక ధ్యానంతో పైనుంచి క్రిందికి చూస్తున్న అతన్ని చూసిన లావణ్యకు అతని కోరిక అర్థమయిపోయింది. తనకు ఉద్యోగం లేకపోతే ఆకలితో అలమటించే కుటుంబ సభ్యులు గుర్తుకొచ్చారు

"ఏదో ఒక మార్గం చెప్పండిసార్" అంది దిగులుగా.

"ఈ ప్రమాదంలోంచి నన్ను తప్పించలేరా...అంది దిగులుగా మళ్ళీ.

"ఎలాగో తప్పించగలను కానీ..." అంటూ ఆమె జాకెట్‌కు చీరకు మధ్య గులాబీ రంగులో మెరిసే ఆమె పొట్టవైపు చూపునిలిపాడు.

ఆమె ఇన్ని రోజులూ ఒకరిని లెక్క చేయకుండా జబర్దస్తీగా బ్రతికింది. కాని ఇది తన జీవిత సమస్య. చివరకు "మీ ఇష్టం" అంది తలవంచుకొని పైటతో పొట్ట కనపడకుండా కప్పుకొని.

గదిలో ఓ మూలనున్న కాంప్ కాట్ చూపిస్తూ "...హి...హి...హి" అన్నాడు జంబులింగం మాటలు రాక తడబడుతూ.

లావణ్యకు తన జీవితం శూన్యమనిపించింది. మొదట మేనేజింగ్ డైరెక్టరు, తరువాత ఒక్కొక్కరుగా ఆఫీసు స్టాఫు అందరి చేతిలో తను పతమైపోయినట్లు భావించింది.

ఎలాగో మాటలు కూడదీసుకుని "సార్ నా కివి నిషిద్ధపురోజులు. మూడురోజులు తరువాత మీ కోరిక తీరుస్తాను" అంది గద్గదస్వరంతో.

జంబులింగం ఒక్కసారిగా నిరాశపడిపోయాడు.

"ప్రామిస్" అన్నాడు చివరకు.

ప్రామిస్ సార్" అంది లావణ్య ఎంతో నమ్మకంగా.

"సరే చెక్కుబుక్కు సంగతి నాకు వదిలేసి నువ్వు నిశ్చింతగా ఉండు"

"థాంక్స్ సార్. సెలవు తీసుకొంటాను" అంటూ అక్కడినుంచి వచ్చేసింది లావణ్య.

"టిట్ ఫర్ టాట్" దీనికి గుణపాఠం బాగా చెప్పాను. అని నవ్వు కొంటూ చెక్కు బుక్కు జేబులోంచి తీసి టేబులు డ్రాయరులో పెట్టాడు జంబులింగం.

డిస్పాచ్ సీటులో తూగుతున్న శంకరయ్య, ముఖాన పట్టిని చెమటను పైటతో తుడుచుకుంటూ మేనేజింగ్ డైరెక్టరు రూములోనుంచి వస్తున్న లావణ్యను చూసి పాపం కాన్ఫరెన్సులో ఎక్కువ పని ఈమెకే అనుకొంటూ బాధపడ్డాడు.

అతని జాలి చూపుల్ని ఇంకో విధంగా అర్థం చేసుకొన్న లావణ్య చప్పున వెనక్కు తిరిగిచూసి కంగారుపడిపోయింది. గది కిటికీ కొద్దిగా

తెరుచుకొని ఉంది. హడావుడిలో తను కిటికీలు మూయడం మరచి పోయింది. దొంగతనంగా శంకరయ్య జరిగిందంతా చూసుంటాడు తన మీద పగ ఉన్న శంకరయ్య దీన్ని తెల్లారేసరికి ఊరంతా గగ్గోలు చేస్తాడు. ఎలా శంకరయ్య నోరు మూయించడం?

గజిబిజిగా ఉన్న లావణ్య మెదడులో ఒక ఆలోచన మెరిసింది. వెంటనే బయటికి వచ్చి వరండాలో కూర్చొని తూగుతున్న ప్యూను పుల్లయ్యకు "ఒరే బాబా కేఫ్ కెళ్ళి రెండు కాఫీలు తీసుకురా. తలనొప్పిగా ఉంది" అంటూ అతన్ని పంపింది. ముసల అటెండరు కాళ్ళీడ్చుకుంటూ రెండు ఫర్లాంగుల దూరంలో ఉన్న అ కేఫ్‌కు బయలుదేరాడు.

"శంకరయ్యా ఈ విషయం ఎవరికీ చెప్పవుగా" అంది ఏడుపు గొంతుతో.

అది ఏ విషయమో తెలియని శంకరయ్య ఆమె ఏదో బాధల్లో ఉందని మాత్రం గ్రహించాడు. 'చెప్పనులే' అన్నాడు యథాలాపంగా. రెండడుగులు నడిచి ఎందుకో అనుమానం వచ్చి వెనక్కు తిరిగి శంకరయ్య చెయ్యిపట్టుకొంది.

ఎలుగుబంటు జూలులా దట్టమయిన వెంట్రుకలతో నిండిన తన మొరటు చేతికి ఆమె అందమయిన చేతి స్పర్శ తగిలేసరికి మురిసిపోయిన శంకరయ్య ఇది కలా? నిజమా? తను బ్రతికి ఉన్నాడా? చచ్చిపోయాడా? అనుకొన్నాడు.

"శంకరయ్య నీ పనయ్యేంతవరకూ ఉంటాను. ఈ రోజు నన్ను నీ స్కూటరు మీదా మా ఇంటి దగ్గర డ్రాప్ చేయాలి" గారంగా అంది. ఆమె మాటలకు మత్తుమందు చల్లబడ్డ పిల్లవాడిలా తల ఊపాడు.

కాన్ఫరెన్స్ అయిన మూడో రోజు అనుకొన్నట్లుగా లావణ్య

మేనేజింగ్ డైరెక్టరు కోరిక తీర్చలేదు సరికదా. తను ఉదయం శంకరయ్యను రిజిష్టర్ మారేజ్ చేసుకొన్నానని ప్రకటించి ఆ సాయంత్రం ఆఫీసు హాల్లో రిసెప్షన్ పార్టీ ఏర్పాటు చేసింది.

ఆఫీసు స్టాఫు ఎస్‌ఎల్‌వి టు రాకెట్ తమ నెత్తినే పడినట్టు బిత్తర పోయారు వాళ్ళకు అర్థంకాని విషయం. యింత అందమయిన తాము ండగా పిల్లికళ్ళు, పంది మూతి, గుర్రపు చెవులున్న చెల్లని కాసు శంక రయ్యను అప్సరసలాంటి లావణ్య ఎలా ఇష్టపడిందా అని.

కాని అది శంకరయ్యకు కూడా అర్థంకాని విషయమని పాపం వీళ్ళకు తెలియదు.

అందానికి తగ్గ అణకువ ఉంటే ఆ స్త్రీని అందరూ గౌరవిస్తారు. అలాకాక అహంకారం వుంటే మాత్రం ఎవరో ఒకరు పొంచే ఉంటారని లావణ్యకు అర్థమయింది. అందుకనే బాహ్య సౌందర్యంకంటే ఆత్మ సౌందర్యం గల శంకరయ్యను చేసుకొన్నందువల్ల తను సుఖపడగలదని ఆమెకు తెలుసు.

*